# కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ




కొత్త కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు పూలమొక్కలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి

రాజన్న సిరిసిల్ల, జూన్ 16 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కలెక్టర్‌గా సందీప్‌కుమార్ ఝా ఆదివారం బాధ్యతలు స్వీకరించగా, ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వేములవాడ రాజన్నను దర్శించుకున్న అనంతరం సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్‌కు చేరుకోగా, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీపీవో బుచ్చయ్య, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్, ఆయా శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఐలు శిక్షణ తరగతులకు న్యాయవాదులు



సత్యనారాయణను సన్మానిస్తున్న వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యులు

వేములవాడ/వేములవాడ టౌన్, జూన్ 16: ఆల్ ఇండియా లాయర్స్ యూనియర్ (ఐలు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో నూతన చట్టాలపై నిర్వహించిన శిక్షణ తరగతులకు వేములవాడ బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు హాజరయ్యారు. శిక్షణలో వృత్తి మెలకువలు, కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కే సత్యనారాయణను వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి అవదూత రజినీకాంత్, సీనియర్ న్యాయవాదులు పొత్తూరి అనిల్ కుమార్, గడ్డం సత్యనారాయణరెడ్డి, కిశోర్‌రావు, సుధాకర్‌రెడ్డి, రాజు, దివాకర్, అంజయ్య, రాజ్‌కుమార్, గంగారాజు, మనోహర్, నరేశ్, ప్రశాంత్, మహేందర్, నర్సింగరావు, నవీన్, శంకరయ్య, అభిలాష్, జనార్దన్, కిరణ్, మహేశ్‌బాబు, నాగేందర్, మహిళా న్యాయవాదులు సుజాత, పద్మ, సరిత, అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

## వదంతులు నమ్మవద్దు

తెలంగాణ చౌక్, జూన్ 16: సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని మతాలకు చెందిన ప్రజలు సోదరభావంతో శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకొని మత సామరస్యానికి ప్రతీకగా నిలువాలన్నారు. అసత్య ప్రచారాలు, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అభ్యంతరకర పోస్టులు సోషల్‌మీడియాలో పెట్టవద్దన్నారు. తప్పుడు వార్తలను పోస్ట్ చేసినా.. ఇతర గ్రూప్‌లో ఫార్వర్డ్ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'స్పోర్ట్స్ స్కూల్'లో ప్రవేశాలకు ఆహ్వానం

రుద్రంగి, జూన్ 16: కరీంనగర్, హకీంపేట, ఆదిలాబాద్‌లోని తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 2024-25 సంవత్సరంలో ప్రవేశాల కోసం ప్రస్తుతం నాలుగో తరగతి ప్రవేశాలు పొందే విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో శ్రీనివాస దీక్షితులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో ఈ నెల 21 నుంచి 25వరకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పుట్టిన తేదీ, ధ్రువీకరణ పత్రాలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**డాక్యుమెంట్ పోయినది**

★ **నాయొక్క భూమికి సంబంధించిన** డాక్యుమెంట్ (సేల్ డీడ్) నెం॥ 4307/97, మంకమ్మతోట, నుండి కోర్టు చౌరస్తా వెళ్ళే దారిలో పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికినచో ఈక్రింది నెంబర్‌కు తెలుపగలరు. వి.సుజాత సెల్: 9618624624
NTK-319927

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194



బండ ప్రకాశ్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో రామకృష్ణ



కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ప్రసాదం అందిజేస్తున్న ఈవో

# పోటెత్తిన భక్తజనం

- భక్తులతో కిటకిటలాడిన రాజన్న ఆలయం
- సమకూరిన ₹22లక్షల ఆదాయం



స్వామివారి దర్శనం కోసం క్యూలో నిలబడ్డ భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 16: వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాముననే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకున్నారు. కోడె మొక్కు కోసం రెండు గంటలు, స్వామివారి దర్శనానికి మరో రెండు గంటల సమయం పట్టిందని భక్తులు చెప్పారు. రాజన్నను 30 వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, సుమారు ₹22 లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

### లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ పూజలు

వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ దర్శించుకున్నారు. అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఇన్‌చార్జి ఈవో రామకృష్ణ వారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, తిరుపతిరావు, ఇన్‌స్పెక్టర్ అశోక్, వంశీమోహన్‌శర్మ ఉన్నారు.

### రాజన్న సన్నిధిలో కలెక్టర్

వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని జిల్లా నూతన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వారికి ఆలయ ఇన్‌చార్జి ఈవో రామకృష్ణ పుష్పగుచ్ఛం అందజేశారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఈవో వారికి స్వామివారి శేషవస్త్రం కప్పి, ప్రసాదం అందజేశారు. వారి వెంట అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, ఆలయ అధికారులు తదితరులు ఉన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ఇల్లంతకుంట, జూన్ 16: రేపాకలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల (2003-04లో ఎస్సెస్సీ బ్యాచ్) సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో 20ఏండ్ల తర్వాత మొదటిసారిగా కలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అప్పటి తరగతి గదులను పరిశీలించి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి, ఉపాధ్యాయులు రాజగోపాలచారి, రాజయ్య, మల్లేశం, తిరుపతిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేందర్‌రెడ్డి, హకీం, తిరుపతిరెడ్డి, ప్రసాద్, అనిల్, కనకలక్ష్మి, అనిత, మమత, సంతోష, తదితరులు పాల్గొన్నారు.

## కస్బెకట్కూర్‌లో ఘర్షణ

- పలువురికి గాయాలు
- ఠాణాలో ఇరువర్గాల ఫిర్యాదు

సిరిసిల్ల రూరల్, జూన్ 16: తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్‌లో ఆదివారం ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన బత్తుల సుమన్(32) గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. బత్తుల సుమన్ అదే గ్రామానికి చెందిన జూపల్లి వెంకట్రావు దగ్గర సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అంత్యక్రియల్లో అన్నదమ్ములైన జూపల్లి వెంకట్రావు, రాజేశ్వర్‌రావుతోపాటు పలువురు పాల్గొన్నారు. తన ఇంటివద్ద కావాలని అంతిమ యాత్రను ఆపి డప్పులు కొట్టేవారికి డబ్బులు ఇచ్చి పెడుతున్నారని రాజేశ్వర్‌రావు, వెంకట్రావుపై గ్రామానికి చెందిన అజయ్‌రావు వాగ్వాదానికి దిగారు. అంత్యక్రియలు పూర్తి చేసుకుని తిరిగివస్తుండగా మరోసారి గొడవ జరిగింది. మాటమాట పెరిగి దాడులకు దారితీసింది. ఈ ఘటనలో రాజేశ్వర్‌రావు, వెంకట్రావు, డ్రైవర్ కృష్ణకు గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఠాణాలో ఫిర్యాదు చేసుకున్నారు. ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

## మొక్కల పంపిణీ

మండల కేంద్రానికి చెందిన దుంపెన రమేశ్ ఆదివారం పలువురికి పలు రకాల మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు.

## కమిటీ ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, జూన్ 16: రాజన్నపేటలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోగూరి చంద్రారెడ్డి, డైరెక్టర్లుగా కాయితి సత్తిరెడ్డి, చల్ల గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చల్ల మోహన్‌రెడ్డి, కాయితి రాజిరెడ్డి, ద్యాప పెద్ద కొమురయ్య, రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు.

కోనరావుపేట, జూన్ 16: కనగర్తిలో పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా జిల్లెల లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా మోతె రాజిరెడ్డి, మారుపాక చంద్రయ్య, రావులపల్లి పెద్ద మహిపాల్‌రెడ్డి, ఎల్లె ప్రభాకర్, జాప పరశురాములు, మారుపాక రాజయ్య, రావులపల్లి చిన్న మహిపాల్‌రెడ్డి, అండెం రాములు, ఏరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఇక్కడ కార్యదర్శి అందెం రాజిరెడ్డి, నిర్వాహకుడు రావులపల్లి వెంకట్‌రెడ్డి ఉన్నారు.

# వర్షం.. హర్షం

ఇల్లంతకుంట, జూన్ 16: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షం పడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎండవేడిమి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. వెంకట్రావుపల్లిలో మురుగు కాలువలు సరిగ్గా లేనందున, వర్షపు నీరు ఇండ్లల్లోకి చేరి ప్రజలు ఇబ్బందిపడ్డారు.

# పురోహితుడి ఆత్మహత్య



సంతోష్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 16: క్షణికావేశంలో మూడేండ్ల క్రితం ఓ పురోహితుడు ఒకరిని హత్య చేయగా, కేసులు, కుటుంబ కలహాలతో చివరకు తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన పచ్చకాంతం సంతోష్(40) అనే పురోహితుడు. అతడి తల్లిదండ్రులు గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో ఉంటున్నా రు. సంతోష్ గొల్లపల్లికి చెందిన సుజాతను పెండ్లి చేసుకుని ఇల్లరికం ఉంటున్నాడు. వారికి ఒక కూతురు వైష్ణవి, కుమారుడు విశాల్ ఉన్నారు. రానురాను జల్సాలకు అలవాటు పడి మద్యానికి బానిసయ్యాడు. 2021లో దమ్మన్నపేటలో నివాసముండే సంతోష్ తల్లిని అదే గ్రామానికి చెందిన నేవూరి శ్రీనివాస్‌రెడ్డి దూషించినట్లు తెలుసుకున్నాడు. పొలం వద్ద ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని మాట్లాడుదామని ఇంటికి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. దీంతో హత్య కేసులో జైలుపాలై, బెయిల్‌పై విడుదలయ్యాడు. తర్వాత గొల్లపల్లి లో ఉండకుండా తంగళ్లపల్లికి వెళ్లాడు. అప్పటి నుంచి కోర్టులు, కేసులతో అప్పులెక్కువై మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమం లో అప్పులు తీర్చేమార్గం లేక.. కేసును తప్పించుకునే అవకాశం లేక మనస్తాపానికి గురయ్యాడు. దీంతో పాటు సంతోష్ తన తమ్ముడు శివకుమార్‌తో ఆస్తుల విషయంలో ఆదివారం గొడవపడ్డాడు. ఇంటికి వచ్చిన తర్వాత భార్య సుజాతతో మద్యం మత్తులో తగవుపెట్టుకున్నాడు. భయభ్రాంతులకు గురైన సుజాత తన కూతురుతో కలిసి కొత్త ఇంటికి వెళ్లడంతో మనస్తాపానికి గురైన సంతోష్, ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## బాల్యమిత్రుల చేయూత

ఎల్లారెడ్డిపేట, జూన్ 16: సింగారం గ్రామానికి చెందిన ముత్యాల బాలకిషన్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి బాల్యమిత్రులు చేయూతనందించారు. బండలింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (2002-03 లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.70వేలు అందించారు. ఇక్కడ తిరుపతి, కిషన్, అంజిరెడ్డి, భాస్కర్, ప్రవీణ్, ఎల్లం, రాజు, బాలకిషన్, దత్తాద్రి, రమేశ్‌రెడ్డి, బాల్‌నర్సు, సంతోష్, శేఖర్ ఉన్నారు.

## జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలి

శంకరపట్నం, జూన్ 16: హుజూరాబాద్ పట్టణంలో జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని సీనియర్ న్యాయవాదులు బానాల శ్యాంసుందర్, నరహరి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.



మాట్లాడుతున్న తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్

# పవర్ లూమ్స్ పరిశ్రమలకు పనులు కల్పించాలి

- తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్

గంగాధర, జూన్ 16: జియోట్యాగ్ విధానంతో సంబంధం లేకుండా పవర్ లూమ్స్ పరిశ్రమల్లో పని చేసే చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు ప్రభుత్వం చేతినిండా పని కల్పించాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చిందం సునిత డిమాండ్ చేశారు. ఆదివారం చేనేత ఐక్యవేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అధ్యక్షతన గర్శకుర్తిలో వస్త్రోత్పత్తి వ్యాపారులు, కార్మిక, పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో నేతన్న వెతలపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎనిమిది మాసాలుగా పవర్ లూమ్స్‌పై వస్త్రోత్పత్తులు నిలిచిపోయి పవర్ లూమ్స్ యజమానులు, ఆసాములు, కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు లేక అవస్థ పడుతున్న పవర్ లూమ్స్ కార్మికులు, పరిశ్రమలకు ప్రభుత్వం పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జియోట్యాగ్ విధానాన్ని రద్దు చేసి, ప్రతి పవర్ లూమ్స్‌కు ప్రభుత్వం వస్త్రోత్పత్తులు అందించి పనులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమ, పవర్ లూమ్స్‌పై విజిలెన్స్ దాడులు జరుగకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పనులు లేక అవస్థ పడుతున్న నేత కార్మికులకు పనులు కల్పించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఐక్యవేదిక రాష్ట్ర, జిల్లాల నాయకులు సదానందం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మైసయ్య, ఆశన్న, శ్రీనివాస్, చిరంజీవి, భాస్కర్, నారాయణ, లక్ష్మీనారాయణ, సురేశ్, నాగన్న, కోటేశ్వరరావు, శారద, రమాదేవి, పద్మ, నీరజ, చిందం రాజమౌళి, విఠోభ, మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.

## వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

గంగాధర, జూన్ 16: మధురానగర్‌లో ఏర్పాటు చేసిన చక్రిక న్యూట్రిషన్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు వెల్‌నెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని ర్యాలపల్లిలో పెద్దమ్మ, పోచమ్మ, హిమ్మత్‌నగర్‌లో పెద్దమ బోనాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఇక్కడ కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్ ఉన్నారు.

# ఉత్తమ సాహిత్యంతోనే సమాజ వికాసం

- కథా రచయిత పెద్దింటి
- 'మరణం వరమైన వేళ' కథల సంకలనం ఆవిష్కరణ



ప్రశంసా పత్రాలు అందుకున్న రచయితలతో నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, జూన్ 16 : మన గురించి ఆలోచిస్తే స్వార్థమని, జనం కోసం ఆలోచిస్తే సాహిత్యమని, ఉత్తమ సాహిత్యంతోనే సమాజ వికాసం సాధ్యమని ప్రముఖ రచయిత, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత పెద్దింటి అశోక్ కుమార్ పేర్కొన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రైమ్ కథల పోటీల ద్వారా సేకరించిన కథలతో రూపొందించిన 'మరణం వరమైన వేళ' కథల సంకలనం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక భగవతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దింటి, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనిషి ఎలా బతకాలో సాహిత్యం నేర్పుతుందని, సాహిత్యం లేని సమాజాన్ని ఊహించలేమని పేర్కొన్నారు. ఉత్తమ సమాజాన్ని నిర్మించేది సాహిత్యమేనన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కవి, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ, మన చుట్టూ ఉన్న నేరమయ ప్రపంచం నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో, జరుగుతున్న నేరాలను ఘోరాలను నుంచి సమాజాన్ని ఎలా కాపాడాలో క్రైమ్ కథల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన శతాధిక గ్రంథకర్త, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కార గ్రహీత చంద్రయ్య మాట్లాడుతూ, కథల రచనలో తీసుకోవాల్సిన మెళకువలు, కథా శిల్పం, నడక తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో రచయితలు గాజోజు నాగభూషణం, కాసు మహేందర్ రాజు, స్తంభంకాడి గంగాధర్, పీవీవీ సత్యనారాయణ, ఎన్‌వీ శ్రీధర శర్మ, ఎంవీ చంద్రశేఖర్ రావు, పారుపల్లి అజయ్ కుమార్‌ను శాలువాలతో సన్మానించి, నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గంప ఉమాపతి, యోగ ఆచార్య సంపత్ కుమార్, కొత్త అనిల్ కుమార్, బొమ్మకంటి కిషన్, ఇటిక్యాల రాము, విలాసాగరం రవీందర్, ప్రేమ్‌సాగర్, ఎర్రోజు వెంకటేశ్వర్లు, గుండు రమణయ్య, తడిగొప్పుల కుమారస్వామి, దామరకుంట శంకరయ్య, మఠం సాంబమూర్తి పాల్గొన్నారు.

# కంటిచూపునివ్వడమే లక్ష్యం

- బీసీఎం వ్యవస్థాపకుడు వైరాగ్యం రాజలింగం
- 32 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు, 55మందికి కంటి పరీక్షలు



దవాఖానలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణుడు డాక్టర్ వైరాగ్యం రాజలింగం

బోయినపల్లి, జూన్16: కొదురుపాక బీసీ ఎం కంటి దవాఖాన ద్వారా పేదల అభ్యున్నతికి కృషి చేయడంతోపాటు వారికి కంటిచూపు ఇవ్వడమే ప్రధాన లక్ష్యమని బీసీఎం వ్యవస్థాపకుడు వైరాగ్యం రాజలింగం, డా రీటబహదుర్‌షా దంపతులు పేర్కొన్నారు. ఆదివారం కొదురుపాక బీసీ ఎం కంటి దవాఖానలో 32మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. అనంతరం 55మందికి కంటి పరీక్షలు చేసి, మరికొందరికి ఆపరేషన్‌కు సిఫారస్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలతోపాటు కంటి సమస్యలున్న వారందరికీ ఆపరేషన్ చేసి, వారికి కంటి చూపును ఇవ్వడమే తమ లక్ష్యమని చెప్పారు. మారుమూల పల్లెల్లో కార్పొరేట్‌కు దీటుగా కొదురుపాకలో ట్రస్టు ద్వారా కంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 1,271మందికి కంటి ఆపరేషన్లు చేశామన్నారు. ఆదివారం మినహా ప్రతి రోజూ దవాఖానలో కంటి వైద్య నిపుణులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణురాలు డా అనూషరెడ్డి, అప్రమత్రిస్ట్ అన్వేష్, మేనేజర్ ధారవేని తిరుపతి, వోటి సిబ్బంది చంద్రయ్య, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



బాధితురాలి కూతురికి నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

సిరిసిల్ల టౌన్, జూన్16: అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి భరోసానిచ్చారు. అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ మహిళా కార్యకర్త వడ్లూరి లక్ష్మిని ఆదివారం స్థానిక అంబేద్కర్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఖర్చుల కోసం రూ.20వేల నగదును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా స్థానిక బీఆర్ఎస్ నాయకుడు సిరిగిరి మురళి తనవంతుగా రూ.5వేలు అందించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ, ప్రతి కార్యకర్తాను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. ఆపద సమయంలో ముందుండి అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. లక్ష్మి అనారోగ్యం బారినుంచి కోలుకునే వరకు పార్టీపరంగా సహకారం అందిస్తామని చెప్పారు. ఇక్కడ నాయకులు కత్తెర వరుణ్, గోశిక శ్రీనివాస్, ఆకునూరి అజయ్ ఉన్నారు.




వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

## ఫొటోగ్రాఫర్‌పై దాడి సరికాదు

వేములవాడ, జూన్ 16: ఫొటోగ్రాఫర్లపై దాడి చేయడం సరికాదని వేములవాడ పట్టణంలో ఆదివారం ఫొటోగ్రాఫర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల సంఘం ఉపాధ్యక్షుడు వేణు మాట్లాడుతూ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో సెల్‌ఫోన్‌లో ఫొటో తీయనందుకు ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని తెలంగాణచౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ మహంకాళి బాబు, వేణు, నాగరాజు, ప్రభాకర్, శ్రీకాంత్ ఉన్నారు.



నెత్తిన బోనంతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

## ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడ రూరల్, జూన్ 16: హన్మాజీపేటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు.